ఓయూలో హిమాచల్ ప్రదేశ్ బృందం


మాట్లాడుతున్న ఓయూ వీసీ ప్రొ.కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో హిమాచల్ ప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ మంత్రి రాజేష్ ధర్మాని నేతృత్వంలో 13 మంది సభ్యుల బృందం పర్యటించింది. సోమవారం ఓయూ వీసీ ప్రొ.కుమార్ ఇతర అధికారులతో సమావేశమై విద్య, పరిశోధన, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ప్రత్యేకంగా డిజిటల్ విద్యపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వీసీ వివరించారు. కార్యక్రమంలో ఓయూ అధికారులతో పాటు హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పరీక్షా ఫలితాలను విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ (హెచ్‌డబ్ల్యూవో) ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుదిజాబితాను విడుదల చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. సోమవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. రాత పరీక్ష, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. అనంతరం బీసీ నేత ఆర్.కృష్ణయ్యను కలిసి ఫలితాల జాప్యం, నిరుద్యోగుల సమస్యలపై వివరించినట్లు జాన్సన్ బాబు, చందు, విఠల్, శ్రీధర్ పేర్కొన్నారు.

ఎంబీఏ పరీక్ష ఫీజును తగ్గించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎంబీఏ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజును తగ్గించాలని తెలంగాణ రిపబ్లికన్ స్టూడెంట్ యూనియన్ (టీఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షులు బోయ రమేష్ డిమాండ్ చేశారు. కేవలం ఒక్క సెమిస్టర్ పరీక్షకే రూ.5000 ఫీజును వసూలు చేస్తే పేద విద్యార్థులకు ఆర్థికంగా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. సకాలనికి స్కాలర్‌షిప్‌లు రాక విద్యార్థులు అవస్థలు పడుతుంటే పరీక్ష ఫీజును పెంచడం దారుణమన్నారు. పెంచిన ఫీజును తగ్గించాలని ఓయూ అధికారులను కోరారు.

ఉచిత వైద్య శిబిరం



బౌద్ధనగర్: ముత్తూట్ ఫైనాన్స్ సహకారంతో వారాసిగూడ గొల్ల పుల్లయ్య బావి బస్తీలో గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 86 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ వల్లాల మంజుల, బస్తీవాసులు గట్టయ్య, నాగరాజు, గజరాత్‌పాల్, యూనియన్ నాయకులు మాధవి, స్వామి, రజిత పాల్గొన్నారు.

ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమకారులకు ఉద్యోగాలు, గుర్తింపు కార్డులతో పాటు 250 గజాల స్థలం ఇవ్వాలని వక్తలు డిమాండ్ చేశారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక (టీవీయూవీ) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి వేదిక చైర్మన్ కంచర్ల బద్రి అధ్యక్షత వహించగా ఇఫ్లూ ప్రొ.పంతకాల శ్రీనివాస్, ఓయూ జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, పుదారి హరీష్‌గౌడ్, రవీంద్రనాయక్, కృష్ణలత, సునీల్‌శెట్టి, గద్దం శ్రీనివాస్, స్వామిగౌడ్ తదితరులు ప్రసంగించారు.

బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణ మృతి



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్ పేట్ డివిజన్ బండమైసమ్మనగర్ ప్రాంతానికి చెందిన సత్యనారాయణ(44) గుండెపోటుతో మరణించారు. సత్యనారాయణకు సోమవారం తెల్లవారు జామున గుండెపోటు రావడంతో కన్నుమూశారని కుటుంబీకులు చెప్పారు. మృతుడికి భార్య, అయిదుగురు కూతుళ్లు ఉన్నారు. బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె. హేమలతకు వరుసకు కుమారుడైన సత్యనారాయణ బీఆర్ఎస్‌లో చురుకుగా పని చేశారు. ఉదయం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ కె. హేమలత తదితరులు సత్యనారాయణ భౌతికకాయాన్ని సందర్శించి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు.

ఆలయ హుండీల లెక్కింపు

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ ఎస్ఆర్‌నగర్ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర దేవాలయం హుండీలకు సోమవారం రోజున లెక్కించారు. హుండీల ద్వారా రూ. 3,79,992 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి నరేందర్‌రెడ్డి తెలిపారు.

అధ్వానవనం

లాలాపేటలోని పార్కును పట్టించుకోని పాలకులు

- డిప్యూటీ మేయర్ డివిజన్‌లోనే ఈ దుస్థితి
- పశువులకు నిలయంగా మారిన పార్కు


జీహెచ్‌ఎంసీ పార్కులో పశువులు

లాలాపేట: పేరుకే అది పార్కు.. అయితే గేటు సరిగ్గా ఉండదు.. లోపలకు వెళితే కనిపించేది పచ్చదనం పెంచే మొక్కలు కాదు.. చెత్త..పిచ్చిమొక్కలు..ఇక వాహనాలు కూడా పార్కింగ్ చేసి ఉంటాయి.. ఇదీ తార్నాక మున్సిపల్ డివిజన్ లాలాపేటలోని పార్కు దుస్థితి.. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లోనే పార్కుస్థితి ఇలా ఉంటే ఇక మిగతా పార్కుల పరిస్థితి ఎలా ఉంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

- ఉదయం, సాయంత్రం వేళల్లో సేద తీరడానికి ఐరన్ బెంచీలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కులో పచ్చని మొక్కలను నాటారు. అయితే నిర్వహణ లోపం కారణంగా ప్రధాన గేటు విరిగి పోయింది. నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారు లేరు.
- పార్కులోని ఐరన్ బెంచీలు మాయమయ్యాయి. పూల మొక్కలు, పచ్చని చెట్లు ఎండిపోతున్నాయి.
- పార్కు చుట్టు కొందరు తమ వాహనాలను నిలిపి పార్కింగ్ స్థలంగా వాడుకుంటున్నారు.
- ఇక చెత్త చెదారం పేరుకుపోయింది. పార్కు గేటు విరిగిపోవడంతో పశువులు, కుక్కలు అందులో తిష్టవేశాయి.
- పార్కు చుట్టూ భవన నిర్మాణ సామగ్రి, శిథిలాలు పేరుకుపోయాయి. రాత్రి వేళల్లో అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది.
- జనవాసాల మధ్య ఉన్న జీహెచ్‌ఎంసీ పార్కు ఇంతటి దుస్థితికి చేరుకున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పార్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం


జీహెచ్‌ఎంసీ పార్కు ముందు నిర్మాణ సామగ్రి, కార్ పార్కింగ్

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు



సనత్‌నగర్: బేగంపేట, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఇన్‌ఛార్జి ఏడీఈ కిషోర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్సార్‌నగర్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ లేన్, బీ-టైప్ క్వార్టర్స్, 3ఆర్‌టీ క్వార్టర్స్, ఎస్సార్‌నగర్ కమ్యూనిటీ హాల్ మెయిన్‌రోడ్డు, గౌతమి ధామం స్కూల్ ఏరియా, ఓల్డ్ రిలయన్స్ ఫ్రెష్, జ్ఞాన సరస్వతి స్కూల్, ఎస్సార్‌నగర్ మెయిన్‌రోడ్డు ఏరియా, కమ్యూనిటీ హాల్ లేన్, ఆంధ్రాబ్యాంక్ లేన్, ఎస్‌బీహెచ్ బ్యాంక్ లేన్, 2ఆర్‌టీ, 3ఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతంలో సరఫరా ఉండదన్నారు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సూర్యోదయ కాంప్లెక్స్, నల్లి సిల్క్ శారీస్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

రాంగోపాల్‌పేట్: సీతాఫల్‌మండి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీతాఫల్‌మండి వెల్ఫేర్ అసోసియేషన్, ఎల్ఎస్ టవర్స్, ఆంధ్రా బ్యాంక్, క్లాసిక్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు మేడిబావి, ఇంద్రానగర్ 1,2, మీనా కేఫ్, ఎంపీ రాజయ్య ఇంటి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

బేగంపేటలో నీటి సమస్యను పరిష్కరించండి


వాటర్‌వర్క్స్ ఎండీకి సమస్యలను విన్నవిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: బేగంపేట డివిజన్‌లో వాటర్‌వర్క్స్ విభాగం చేపట్టనున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బేగంపేట డివిజన్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. ముఖ్యంగా బేగంపేట డివిజన్‌లో లో ప్రెషర్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గతంలో మంజూరై పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతూ ఇబ్బందులు పడుతున్నారని, పాత మ్యాన్‌హోల్స్ స్థానంలో కొత్త వాటిని నిర్మించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వారితో పాటు నాయకులు శ్రీహరి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి


కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో అమీర్‌పేట మండల పరిధిలోని అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ల కింద ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు సంతోష్ మణికుమార్, కూతురు నర్సింహ్మా, బాలరాం, జమీర్, మోహన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు



సనత్‌నగర్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. బీజేపీ సనత్‌నగర్ డివిజన్ కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకులు వెల్లాల రామ్మోహన్, మహంకాళి జిల్లా ఎకనామిక్ సెల్ కన్వీనర్ వెంకట సుబ్బారావు, డివిజన్ అధ్యక్షులు కృష్ణ చైతన్య నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, అనురాధ పాల్గొన్నారు.

'వేలగొంతులు..లక్ష డప్పులు'కు లక్షలాదిగా తరలిరండి

ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతిని బొర్ర బిక్షపతి


సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి బొర్ర బిక్షపతి మాదిగ

బన్సీలాల్‌పేట్: ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ల వల్ల మాదిగ, మాదిగ ఉపకులాలు ఏళ్ల తరబడి విద్యా, ఉద్యోగ, రాజకీయపరంగా తీవ్రంగా నష్టపోయారని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి బొర్ర బిక్షపతి మాదిగ అన్నారు. బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జరిగిన వేలగొంతులు...లక్షడప్పుల సన్నాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి డప్పుతో కదిలి రావాలన్నారు. మాదిగలు తాడోపేడో తేల్చుకోడానికి ఫిబ్రవరి 7న నగరంలో నిర్వహించే వేలగొంతులు...లక్షల డప్పులు కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ఫిబ్రవరి 1న బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సన్నాహక కార్యక్రమానికి మంద కృష్ణమాదిగ హాజరవుతున్నట్లు చెప్పారు. ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహారావు, అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్, నాయకులు వీఎస్ రాజు, సత్యనారాయణ, అరుణ్, విజయ్, శ్రీనివాస్, మాచర్ల ప్రభాకర్, కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లండి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్

బౌద్ధనగర్: భారతీయ జనతా పార్టీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన సాయి ప్రసాద్‌గౌడ్ సోమవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. డివిజన్‌లోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కిషన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నాగేష్ రెడ్డిలు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి కుంభ హారతి కలశం అందజేత



మీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి ఓ భక్తుడు కుంభ హారతి కలశాన్ని అందజేశారు. షేక్‌పేటకు చెందిన మహేష్ అర కిలోతో తయారు చేయించిన కలశాన్ని అమ్మవారి మూలవిరాట్ వద్ద పూజలు చేయించిన అనంతరం దేవస్థానం చైర్మన్ కొత్తపల్లి సాయిబాబాగౌడ్, అర్చకులు సతీష్‌కు అందజేశారు.

నేడు, రేపు సీనియర్ సిటిజన్స్‌కు పోటీలు

సనత్‌నగర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 ఆసరా కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి, కార్యదర్శి రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళ, బుధవారాల్లో మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఇండోర్ గేమ్స్ అయిన క్యారమ్స్, చెస్, జనరల్ నాలెడ్జ్ పోటీలు, సుందర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్ (లేడీస్ అండ్ జంట్స్), బ్రిస్క్ వాకింగ్ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

రజకులకు ప్రాధాన్యం ఇవ్వాలి



అడ్డగుట్ట: గ్రేటర్ హైదరాబాద్‌లో రజకుల సమస్యలు పరిష్కరించి, ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ వెంకటాచారికి వినతిపత్రం సమర్పించారు. నగరంలోని దోబీఘాట్లలో వసతులు కల్పించాలన్నారు. సంఘం గ్రేటర్ జిల్లా నాయకులు చారకొండ వెంకటస్వామి, మరియాల గోపాల్, కేశవరాజు యాదగిరి, రాజు, కేశవులు పాల్గొన్నారు.

గొల్లకురుమల సంఘం కేలండర్ ఆవిష్కరణ



లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్‌ను సోమవారం బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు గొర్రెల కాపరుల సమస్యలపై మంత్రికి వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 శాతం ఉన్న గొల్లకురుమలకు రాజకీయ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలనీ కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొమ్ము అశోక్‌యాదవ్, సలహాదారు భేరి రామ్‌చంద్రయాదవ్, సొదాని భూమన్న యాదవ్ పాల్గొన్నారు.

రెండు దేవాలయాల్లో హుండీ డబ్బు చోరీ

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని రెండు దేవాలయాల్లో హుండీలోని డబ్బును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. తుకారాంగేట్ పోలీసులు తెలిపిన మేరకు.. తుకారాంగేట్ పహాడీ హనుమాన్ దేవాలయంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం వెనుక భాగంలో తలుపు తాళం విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. ఆంజనేయ స్వామి ఆలయం ముందున్న హుండీని తెరిచి అందులో నుంచి డబ్బు దొంగిలించారు. అదే విధంగా గణపతి ఆలయం హుండీని కూడా తెరిచే ప్రయత్నం చేసి అది రాకపోవడంతో వెళ్లిపోయారు. ఈఓ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చోరీ అయిన మొత్తం రూ.1000 ఉండవచ్చని ఈవో తెలిపారు.

భవాని అమ్మవారి ఆలయంలో :
భవానీ దేవి ఆలయంలో సోమవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. ఆలయంలోని హుండీని బద్దలుగొట్టి డబ్బులు దొంగిలించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. హుండీలో సుమారు రూ. 5 వేల వరకు డబ్బులున్నట్లు వారు చెప్పారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శివనాయుడు

రసూల్‌పురా: మాదకద్రవ్యాలు నేరుగా మెదడు, కేంద్ర నాడీ వ్యవస్థపైన ప్రభావం చూపి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ శివనాయుడు తెలిపారు. సోమవారం ఆర్మీ పబ్లిక్‌స్కూల్‌లో తెలంగాణ మాదక ద్రవ్యాల నిరోధక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారితే రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని, రక్తనాళాలు కుచించుకుపోయి రక్త ప్రసరణకు ఆటంకాలు ఏర్పడతాయన్నారు. తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. యాంటీ డ్రగ్స్ నివారణ అధికారులు శంకర్ యాదవ్, హెచ్ఎం అర్చన రాయ్, కౌన్సిలర్ సుధామీనన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోర్డు నిధులతోనే అభివృద్ధి

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బస్తీలు, కాలనీల్లో బోర్డు నిధులతోనే అభివృద్ధి జరిగి ప్రజాసమస్యలు పరిష్కారం అవుతున్నాయని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ అన్నారు. సోమవారం 7వ వార్డు ఎస్‌బీహెచ్ కాలనీ, జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీల్లో బోర్డు నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను రామకృష్ణ ప్రారంభించారు. అనంతరం కాలనీల్లో పర్యటించి స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కంటోన్మెంట్ బోర్డు పరిధిలో అభివృద్ధి పనులకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదని కేంద్ర ప్రభుత్వ నిధులు, బోర్డు నిధులతో మాత్రమే వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పవన్‌కుమార్, స్థానిక నాయకులు ప్రశాంత్ ప్రభు. శ్రీధర్ రెడ్డి, మంజుల, విశ్వనాథ్, శేఖర్, నాగేందర్, నరసింహ, స్థానికులు అరవింద్, జీఎస్ బోస్, పెద్దరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ'లో కొనసాగుతున్న సీపీఆర్ శిక్షణ


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యనిపుణులు

గాంధీఆస్పత్రి: గాంధీ అలుమ్నీ, గ్లోబల్ అలియన్స్, జనహిత సేవట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ అలుమ్నీ ఎడ్యుకేషన్ సెంటర్‌లో చేపట్టిన సీపీఆర్ ఉచిత శిక్షణ శిబిరం రెండవ రోజైన సోమవారం కొనసాగింది. వైద్యవిద్యార్థులు, నర్సింగ్, ఎన్‌సీసీ కేడెట్లు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, వలంటీర్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, అంబులెన్స్ డ్రైవర్లు, ఆశావర్కర్లు, వైద్యసిబ్బందికి సీపీఆర్ ఉచిత శిక్షణతోపాటు సర్టిఫికెట్లు అందించినట్లు అలుమ్నీ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి తెలిపారు. గాంధీ అలుమ్నీ, గ్లోబల్ అలియన్స్ ప్రతినిధులు డాక్టర్ రాజశేఖర్ కొల్లిపర, రవీందర్ సురకంటి, మహేశ్వర్‌రెడ్డి, అమెరిక హార్ట్ అసోషియేషన్ ఇంఛార్జీ డెన్నీస్ మెకాలే, జనహితసేవట్రస్ట్ ప్రతినిధి నరసింహమూర్తి పాల్గొన్నారు.

కాళేశ్వరం విచారణ అధికారి ప్రత్యేక పూజలు

రసూల్‌పురా: కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు న్యాయ విచారణ అధికారి, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి పినాకి చంద్ర ఘోష్ దంపతులు సోమవారం కంటోన్మెంట్ రిసాలబజార్‌లోని శ్రీ సాయి హనుమాన్ కుటియా దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరం నుంచి కాళేశ్వరం వెళుతూ మార్గమధ్యంలో ఆలయాన్ని సందర్శించిన చంద్రఘోష్ దంపతులతోపాటు డిప్యూటీ ఈఎస్‌సీ అధికారి కె.శ్రీనివాస్‌కు ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువతో ఘనంగా సత్కరించారు. కమిటీ సభ్యులు హరిబాబు, ఉదయ్‌కుమార్, రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, మోహన్‌రావు, బీమ్‌రావు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడపొద్దు


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రాంబాబు

లాలాపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడవద్దని నల్లకుంట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రాంబాబు అన్నారు. ఈ మేరకు జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం తార్నాకలో నల్లకుంట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా కలిగే అనర్థాలను డ్రైవర్లకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వర్ రావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, ఇతరత్రా సామగ్రి పంపిణీ చేశారు. అఖిల భారత మార్వాడీ యువ మంచ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ జరిగింది. అధ్యక్షులు సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప తదితరులు మాట్లాడుతూ.. చదువుతోనే సర్వస్వం రావడంతో పాటు జీవితంలో వృద్ధిలోకి వస్తారన్నారు. విద్యాభివృద్ధి ద్వారానే పేదల జీవితాల్లో వెలుగు చూడగలమని చెప్పారు.


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మార్వాడీ మంచ్ ప్రతినిధులు

బస్తీలు, కాలనీల్లో సదుపాయాలు కల్పిస్తాం


మధుపాల కాలనీలో పర్యటిస్తున్న కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: బస్తీలతో పాటు కాలనీల్లోనూ పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. బుధవారం ఆరోవార్డు పరిధిలోని ఇక్రిశాట్ కాలనీ, మధుపాల కాలనీ, బీహెచ్ఈఎల్ కాలనీ వాసుల ఆహ్వానం మేరకు ఆయా కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో అందుబాటులో ఉన్న పరిమిత నిధులకు తోడు, ఎంపీ లాడ్స్ ద్వారా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఆరోవార్డు అధ్యక్షుడు ప్రతీక్ జైన్, మాజీ అధ్యక్షుడు అజయ్ గౌడ్, సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, ప్రశాంత్ ప్రభు పాల్గొన్నారు.